# అభిమాన సంఘాలు పెడదాం రండి!

సుదర్శనం తన స్నేహితుడు రంగారావు యింటికి వెళ్ళాడు.

"రావోయ్ రా.... ఏంటిలా వేంచేశావ్?" అని అడిగాడు రంగారావు.

"ఊర్కే.... నిన్ను చూసి చాలా కాలం అయింది కదా.... చూసి పోదామని వచ్చా...." అన్నాడు సుదర్శనం.

"ఏంటి మీ ఆఫీసు విశేషాలు?.... అంతా సవ్యంగానే ఉంది కదా?.... నీకేమీ ప్రమోషన్ లాంటిది రాలేదా?...." అని అడిగాడు రంగారావు.

"రాలేదు గానీ నా పేరు ప్రమోషన్ లిస్టులో ఉంది....వచ్చేవారం ఇంటర్వ్యూ ఉంది....బహుశా నాకు ప్రమోషన్ రావొచ్చు...."చెప్పాడు సుదర్శనం గర్వంగా.

"ఏంటి అంత కచ్చితంగా చెప్తున్నావ్?.... నీకెవరైనా యమ్మెల్లే తెల్సా?"

"లేదే...." ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు సుదర్శనం.

"పోనీ మినిస్టర్ తెల్సా?"

"ఊహు.... తెలీదు...."

"పోనీ మినిస్టర్‌కి బామ్మర్దో లేదా ఆబామ్మర్దికి బామ్మర్దో తెల్సా?"

సుదర్శనం గుడ్లప్పజెప్పి చూశాడు.

"తెలీదు.... ఎందుకలా అడుగుతున్నావ్?...." ఎందుకలా అడుగుతున్నాడో చెప్పకుండా మళ్ళీ అడిగాడు రంగారావు.

"పోనీ నీకు రాజకీయ నాయకులో లేదా వాళ్ళ బామ్మర్దులో లేదా వాళ్ళకి వేలు విడిచిన మేనమామలో ఎవరు తెల్సో చెప్పు...."

"నా కెవ్వరూ తెలేదే!.... ...." తెల్లమొహం వేస్తూ అన్నాడు సుదర్శనం.

"ఒరేయ్ బాబిగా.... ఓ మారిలా అద్దం పట్రామ్మా...." లోపలికి చూస్తూ అరిచాడు రంగారావు.


బాబిగాడు అద్దం తెచ్చి ఇచ్చాడు.

"ఇదిగో నోయ్...." ఈ అద్దం తీస్కుని అందులో నీ మొహం ఓసారి చూస్కో...."

"ఎందుకూ?...." అయోమయంగా ప్రశ్నించాడు సుదర్శనం.

"చెప్తాగా.... ముందు చూస్కో...."

సుదర్శనం అద్దంలో మొహం చూస్కున్నాడు.




"ఎలా ఉంది నీ మొహం?" కళ్ళెగరేస్తూ అడిగాడు రంగారావు.

"బాగానే ఉందే!!...." అన్నాడు సుదర్శనం అద్దంలోని తన ప్రతిబింబంకేసి చూస్కుంటూ.

"ఎవరు నాన్నా ఈ దేశ్యంమొహం?" అని బాబిగాడు రంగారావ్ని అడిగాడు.

"విన్నావా మా అబ్బాయ్ ఏమన్నాడో...." అన్నాడు రంగారావు చిలిపిగా నవ్వుతూ.

విన్నానన్నట్టు తలూపాడు సుదర్శనం.

"ఏమన్నాడు?"

"దేభ్యం మొహం అని అన్నాడు" జవాబు ఇచ్చాడు సుదర్శనం.

"మరిప్పుడు అద్దంలో మొహం చూస్కుని చెప్పు నీ మొహం
ా ఉందో?...."

"దేభ్యం మొహంలానే ఉన్నట్టుంది" అన్నాడు నీరసంగా సుద
్శనం.

"అదుగదీ.... అందుకే నీకేమీ తెలీదు.... ఎవరూ తెలీకుండానే
కు ప్రమోషన్ ఎలా వస్తుందని అనుకుంటున్నావ్?...."

"హిహి.... దేభ్యం మొహం.... హిహిహి...." అంటూ చప్పట్లు
ట్టి నవ్వాడు బాబిగాడు.

సుదర్శనం బాబిగాడి వంక చూసి, ఒక్కక్షణం బిక్కమొహం
సి అన్నాడు "మరి నా పర్సనల్ రికార్డు అందరికంటే బాగుంది.... నా
్వీసు కూడా అందరికంటే ఎక్కువ.... క్వాలిఫికేషన్ కూడా ఎక్కువ
రి నాకు ప్రమోషన్ ఎందుకు రాదు?"

"అందుకే నిన్ను దేభ్యం మొహం అన్నది.... అవన్నీ ఉంటే
ిపోదు.... మాంచి రికమండేషను పట్టాలి.... అప్పుడు నీకు ప్రమోషను
స్తుంది" అన్నాడు రంగారావు.

"మరి నాకెవరూ తెలీదే!.... నువ్వే ఈ విషయంలో నాకు సహా
ం చేయాలి!" ప్రాధేయ పడుతూ అన్నాడు సుదర్శనం.

రంగారావు కాస్సేపు ఆలోచించాడు.

"నాకెవరూ యమ్మెల్లేలూ, మినిస్టర్లూ తెలీదే?.... ఎలా? ఎలా?.."
న్నాడు.

"బాగా ఆలోచించు.... మినిస్టర్ కాకపోయినా వాడి బామ్మర్దయినా
వాలేదుగా...." అన్నాడు సుదర్శనం.

హఠాత్తుగా కెవ్వుమని అరిచాడు రంగారావు.

"ఏంటి ఏమైంది?!...." కంగారుగా అడిగాడు సుదర్శనం.

"నువ్వు ముందు పద" లేచి చెప్పులు తొడుక్కుంటూ అన్నాడు రంగారావు.

"ఎక్కడికి?"

"పదమన్నానా?...." కసురుకున్నాడు రంగారావు.

సుదర్శనం లేచి రంగారావుని అనుసరించాడు.

రంగారావు ఓ కిళ్లీ కొట్టు దగ్గర ఆగాడు.

"మంచి కిళ్లీ తింటే ఆ అయిడియాలు బాగా వస్తాయనా ఇక్కడ ఆగావ్? హిహీ?" అన్నాడు సుదర్శనం

"నీ బొంద.... అదేం కాదు.... ఈ కిళ్ళీ కొట్టాయన చేత రికమండేషను చేయిస్తే నీ పని జరిగిపోతుంది...."

సుదర్శనం ఆశ్చర్యపోయాడు.

"కిళ్లీ కొట్టువాడు చెప్తే పని కావడం ఏమిటి? నీకేమైనా మతి పోయిందా?"

"ఎదురుగుండా ఉన్న ఫాన్సీ షాపులో ఓ అద్దం కొనుక్కుందాం రా...." అన్నాడు ఫాన్సీ షాపు వైపు అడుగులు వేస్తూ.

"ఎందుకూ??"

"ఎందుకేమిటి?.... నీ మొహం చూసుకుందువు గాని" పళ్ళు కొరుకుతూ అన్నాడు రంగారావు.

"సరే ... నాది దేభ్యం మొహమని ఒప్పుకుంటున్నా.... పోనీ నువ్వెందుకు అతని చేత రికమండేషను చేయించాలని అనుకుంటున్నావో చెప్పొచ్చుగా??...." అన్నాడు చికాకు పడుతూ సుదర్శనం.

"అలా రా దారికి.... మన ముఖ్యమంత్రి ఎవరూ?"

"చిన్న పిల్లల్ని అడిగినట్లు అలా అడుగుతావేం? భీమారావు!!" చెప్పాడు సుదర్శనం.

"భీమారావు కొడుకెవరూ?" కళ్లెగరేసి చిలిపిగా నవ్వుతూ అడిగాడు.

"చిన్నికృష్ణ!.... అయితే యేంటి?"

"చిన్నికృష్ణ యేం జేస్తాడు?...."

3)

"సినిమా హీరో!!" అసహనంగా చూస్తూ జవాబిచ్చాడు.

"చిన్నికృష్ణ సూపర్ స్టార్ కదా.... అతనికి బోల్డన్ని అభిమాన సంఘాలున్నాయి. ఆ అభిమాన సంఘాలకి సెక్రటరీలు, ప్రెసిడెంట్లు ఉంటారు కదా?.... వాళ్ళు మినిస్టర్ల దగ్గరికి వెళ్ళి మేం చిన్నికృష్ణ అభిమాన సంఘానికి ప్రెసిడెంట్లమీ, సెక్రటరీమీ అని చెప్పుకుని ఆ పనీ ఈ పనీ చేసిపెట్టమని అడుగుతున్నారు. ముఖ్యమంత్రికొడుకుగారి అభిమానులు చెప్పిన పని చెయ్యకపోతే ముఖ్యమంత్రి కొడుక్కి, తద్వారా ముఖ్యమంత్రికీ కోపం వచ్చి తమ పదవులకే ఎక్కడ మోసం వస్తుందోనని భయపడి వాళ్ళ పనులు చేసి పెడ్తున్నారు...." చిద్విలాసంగా నవ్వుతూ చెప్పాడు రంగారావు.

"అయితే ఈ కిళ్ళీ కొట్టాయనా...." అనుమానంగా చూస్తూ ప్రశ్నించాడు సుదర్శనం.

"చిన్నికృష్ణ ఫాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంటు.... పేరు యాదగిరి.... రా.... వాడికి నమస్కారం పెడ్దాం...."

ఇద్దరూ యాదగిరికి నమస్కారం పెట్టారు.

"ఏం కావాలి?.... సాదా కిళ్ళీనా, జర్దా కిళ్ళీనా కలకత్తా రాం ప్యారీనా?.... ఏం గావాలి సాబ్?" అడిగాడు యాదగిరి.

రంగారావు వాళ్ళు వచ్చిన పని చెప్పాడు.

"సిఫారిష్‌కోసం వచ్చింండ్రా — మల్ల అట్ల కడక్ నించుని సలాం కొడ్తుండ్రేంది?— వంగి వంగి సలాంలు కొట్టుండ్రి—" అన్నాడు యాద్గిరి కాస్త గీరగా.

రంగారావు, సుదర్శనం వాడికి వంగి వంగి నమస్కారాలుచేశారు

"మీ పని నేను చేస్పెడ్తా— ఓ అయిదువేలు ఇస్తార్ మల్ల?" అన్నాడు యాద్గిరి.

"అయిదు వేలే— ఎందుకూ అంత?" అన్నాడు సుదర్శనం గుండెలమీద చెయ్యేసుక్కుంటూ.

"అరె ఇస్కి— మల్ల ఇవ్వొద్దా?—

ఇస్మంటి పైసలతోనే మేం చిన్నికృష్ణ సిన్మాల్ రిలీజ్ గిట్టయినప్పుడు హాల్ టౌన్ డెక్రేషన్ గిటజేస్తం!—”

“పోనీ నాలుగు వేలు తీస్కో—” అన్నాడు సుదర్శనం.

“ఛల్ నీ యవ్వ— మీరు వేరే వాల్లకి రిక్‌మెండ్ చై నీకే పది వేలిస్తార్.... మాకు అయిదివ్వనీకి ఏడుస్తార్.... ఇగ నావల్ల కాదు పోంగ్రడి....” అన్నాడు యాదగిరి మొహం చిట్లిస్తూ.

రంగారావు యాదగిరికి సుదర్శనం చేత అయిదువేలిప్పిస్తానని నచ్చజెప్పి బుజ్జగించాడు.

“ఓ రెండువేలు అడ్వాన్సు ఇవ్వ్యాంగ్రడి....మిగ్తాది పనయ్యాక....” అన్నాడు యాద్గిరి.

ఆ సాయంత్రం యాదగిరికి రెండువేల రూపాయలు తెచ్చిచ్చారు. అయిపోయినట్టే మాట్లాడాడు యాదగిరి.

సుదర్శనం ఇంటర్వ్యూ అయిపోయింది. కానీ ప్రమోషన్ రాలేదు. నాలుగు రోజుల తరువాత యాదగిరి మొహం వేలాడేస్కొని చెప్పాడు.

“చమించు సాబ్... మీ పని కాలే.... అభిమాన సంఘాల పేరు జెప్పి అందరూ పన్లు చేయించుకుంటున్నారని మంత్రులందరూ పరేషాన్ అయినారు..ఎవరికినిజంగాచిన్నికృష్ణఅభిమాన సంఘం ఉందో... వరికి లేదో తెలుస్తలేదు. అందుకనే చిన్నికృష్ణ అభిమాన సంఘాలకి గుర్తింపుకార్డులు ఇమ్మని ముఖ్యమంత్రి చెప్పింగ్రడు. కొన్ని అభిమాన సంఘాలకి గుర్తింపు కార్డులు ఇచ్చింగ్రడు. ఆ కార్డు చూపి మంత్రులైన పన్లు చేయించుకోవచ్చు. నాకు ఆ గుర్తింపు కార్డు ఇవ్వలే.... అందుకనే మీ పనీ కాలే....”. అన్నాడు.

“మరి నా రెండువేలు అడ్వాన్సు మాటో?”అని అడిగాడు సుదర్శనం

“ఇంకెక్కడి అడ్వాన్సు సాబ్.... ఆల్లకీ ఈల్లకీ పార్టీలిచ్చేటాన్కి సరిపోయింది” అన్నాడు యాదగిరి. సుదర్శనం నోరెళ్ళబెట్టాడు.

సుదర్శనం సంగతెలా ఉన్నా గుర్తింపు కార్డులున్న అభిమాన సంఘాల ప్రెసిడెంట్లు సెక్రటరీలు మాత్రం వాళ్ళ పనులూ వీళ్ళ పనులూ చేయించి పెట్టి లక్షలు సంపాదిస్తున్నారు.